05ATP21_05ATP21.qxd 21-08-2025 PM 10:36 Page 1



## పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

**తాడిపత్రిటౌన్, ఆగస్టు 21 ప్రభాతవార్త**

తాడిపత్రి అగ్రికల్చర్ డివిజన్ పరిధిలోని తాడిపత్రి రూరల్ మండలం గ్రామాల్లో సాగులో వున్న పత్తి, మొక్కజొన్న పంటలను గురువారం వ్యవసాయ శాఖ మరియు కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి శాస్త్రవేత్తలు పరిశీలించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వచ్చిన వర్షాల ప్రభావం పంటలపైన ఏ విధంగా వుందని గమనించారు. పత్తిలో కొన్నిచోట్ల పూత రాలడం మరికొన్ని చోట్ల కాయ కుళ్ళు గుర్తించడం జరిగింది. పత్తిలో ఒక ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను వేయడం వలన పంట సాధారణ స్థితికి వస్తుందని తెలిపారు. అలాగే పూత రాలడాన్ని 200 లీటర్లలో 400 గ్రాముల బోరాన్ మరియు 40 ఎంఎల్ ప్లానోఫిక్స్ మందుని కలిపి స్ప్రే చేస్తే పూత, పిందె రాలడాన్ని అరికట్టవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. రైతులు కేవలం పురుగుల మందుల ద్వారానే గులాబీ రంగు పురుగు యొక్క ఉధృతిని నివారించలేమని లింగాకర్షణ బుట్టలు ఒక ఎకరానికి 20 చొప్పున 35 రోజుల పంటనుండే పొలంలో పెట్టుకుని గులాబి రంగు పురుగును సామూహికంగా కట్టడి చేయవచ్చన్నారు. తెల్ల దోమ పచ్చ దోమ తామర పురుగు వంటి రసం పీల్చే పురుగులను పసుపు మరియు నీలం రంగు జిగురు అట్టల ద్వారా అరికట్టవచ్చన్నారు. అనంతరం పంట పొలాలను సందర్శించి రైతులందరూ తేమ శాతం తగ్గిన వెంటనే కృషి చేయాలని తెలిపారు. రసం పీల్చే పురుగులను నుండి పంటను కాపాడేందుకు ఫ్లోనికామీడ్ అనే పురుగుల మందును 60 గ్రాములు చొప్పున ఒక ఎకరానికి వాడవచ్చనని సూచించారు. శాస్త్రవేత్తలు తాడిపత్రి రూరల్ మండలంలో కొనగుంటపల్లి, దిగువపల్లి, తేరన్నపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో పెద్దపప్పూరు మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## సేవ్ ఆర్డీటి అంటూ భారీ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, ఆగస్టు 21 ప్రభాతవార్త**

సేవ్ ఆర్డీటి అంటూ గురువారం తాడిపత్రి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అశోక్ పిల్లర్ నుండి ప్రారంభించి తహశీల్దార్ కార్యాలయం వరకు చేపట్టారు. అనంతపురం జిల్లాలో విస్తృతంగా స్వచ్ఛందంగా కులమత రాజకీయాలకు అతీతంగా సేవలు అందిస్తున్న ఆర్డీటికి ఎఫ్‌సిఆర్‌ఏ నిధులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేయడం జరిగిందని, ఈ ఎఫ్‌సిఆర్‌ఏ నిధులను వెంటనే విడుదల చేస్తూ పునరుద్ధరించాలని తాడిపత్రి పట్టణంలో గ్రామాల ప్రజలంతా భారీగా తరలివచ్చి తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో చుక్కలూరు, ఇడుగూరు, గంగాదేవిపల్లి, సజ్జనదిన్నె, ఆలూరు, గుడిపాడు వివిధ గ్రామాల ప్రజలు, సిడిసి మెంబర్లు, జిల్లా మాల మహానాడు అధ్యక్షులు ఆనంద్, మండల అధ్యక్షులు గడ్డం ఇసాక్, ప్రకాష్, చుక్కలూరు ఆదినారాయణ, దారా ఆదినారాయణ, బుడికి శివశంకర్, సుధీర్, తలారి శంకర్‌లు పాల్గొన్నారు.

## అర్హులైన వారి పింఛన్ తొలగించడం చాలా బాధాకరం



ఎంపిడిఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం

**పుట్లూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త**

అర్హులైన వారి పింఛన్ తొలగించడం చాలా బాధాకరమని సిపిఎం మండల కార్యదర్శి సూరి పేర్కొన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం ముందు దివ్యాంగులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంలో తీసుకున్న పెన్షన్‌కు అర్హులైన వారికి పింఛన్ తొలగించడం చాలా బాధాకరమన్నారు. వెంటనే పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం సర్వే పేరున పింఛన్లు తొలగించడం చాలా బాధాకరమన్నారు. బాధితులు డాక్టర్ వద్దకు వెళితే ఏ పరీక్షలు చేయకుండా పంపడమే కాకుండా మీ పింఛన్లు పోయినాయని నోటీసులు ఇచ్చారని ఇది ఏ మాత్రం కరెక్ట్ కాదని బాధితులు వాపోతున్నారన్నారు. మాకు పెన్షన్లు ఇవ్వకపోతే ఆత్మహత్యలే శరణ్యమని వాపోతున్నారు. అర్హులైన వారికి పింఛన్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దశలవారీగా బాధితులను కలుపుకొని పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పెద్దయ్య, నాగేంద్ర, బాధితులు ఎం.కేశవరెడ్డి, నల్లమ్మ, లీలావతి, వసుంధర, కళావతి, మహేశ్వరి, మల్లయ్య, కిట్టయ్య, జయ, పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడి కార్యకర్తల నిరసన




నిరసన తెలుపుతున్న అంగన్‌వాడి కార్యకర్తలు

**యల్లనూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త**

అంగన్‌వాడి కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలోని అంగన్‌వాడి-1 సెంటర్‌లో గురువారం అంగన్‌వాడి కార్యకర్తలు, హెల్పర్లు, మినీ వర్కర్స్ బ్లాక్ డే నిర్వహించారు. ఇందులో భాగంగా పోషణ ట్రాకర్ యాప్ నందు కొన్ని సడలింపులు చేయాలని, రెండు యాపులు కలిపి ఒకే యాప్ చేయాలని, అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలని, గ్రాటిటూ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ నల్ల చీరలు ధరించి నిరసన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు విజయలక్ష్మి, మండల లీడర్లు ఉమాదేవి, విజయలక్ష్మి, వరలక్ష్మి, అంగన్‌వాడి కార్యకర్తలు, మినీ వర్కర్స్, హెల్పర్లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు బిజెపి నాయకుల వినతి

**పుట్లూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త**




ఎమ్మెల్యేకు వినతిపత్రం అందచేస్తున్న బిజెపి నాయకులు

భారతీయ జనతా పార్టీ శింగనమల అసెంబ్లీ కో కన్వీనర్ కుందూ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో గురువారం శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి వినతిపత్రంనఅందచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ శింగనమల నియోజకవర్గంలో వర్షాబావ పరిస్థితుల వలన ఖరీఫ్ పంట కొంతమంది రైతులు వేశారని, కొంతమంది రైతులు పంట వేయలేదన్నారు. వేసిన రైతులకు ఈక్రాఫ్ బుకింగ్ చేస్తున్నారని, ఈ క్రాఫ్ బుకింగ్ చేసిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్సు వచ్చేలా కృషి చేయాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో పంట వేయని రైతుల కోసం ఎరువులు, మందులు, విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో వుంచాలని అధికారులకు సూచించాలన్నారు. నార్పల మండలంలో ఒక పిహెచ్‌సి సెంటర్ మాత్రమే వుందని నార్పల మండలంలో దాదాపు 50 వేల మంది జనాభా వుంటుందని కావునా ఈ జనాభాను దృష్టిలో వుంచుకొని, మరొక పిహెచ్‌సి సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పుట్లూరు మండల కేంద్రంలో హైస్కూల్, మోడల్‌స్కూల్, కస్తూర్బా గాంధీ స్కూళ్లలో కనీసం 1000 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని వారిలో 200 మంది పైగా గ్రామాలకు వెళ్లేవారు వున్నారని కావునా బస్సు నిలిపే స్థలంలో బస్ షెల్టర్ చాలా చిన్నదిగా వున్నదని అక్కడ ఒక విశాలమైన బస్ షెల్టర్ నిర్మించాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు లోమడ రాము, ముప్పగౌని స్వరూప్, రామ్‌శేఖర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని సస్పెన్షన్ చేయాలి

**కదిరి, ఆగస్టు 21 ప్రభాతవార్త**







శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డ రాజశేఖర్‌రెడ్డి, ఆయన అనుచరులు విధులు నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బందిని కిడ్నాప్ చేయడం, అమానుషమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కదిరి తాలూకా అధ్యక్షులు జి.ఫక్రుద్దీన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాయాసం హరి ప్రసాద్‌లు పేర్కొన్నారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ.. మంగళవారం రాత్రి శ్రీశైలం చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రామానాయక్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు మోహన్‌కుమార్, గురువయ్య, డ్రైవర్ ఖరీముల్లాపై దాడి చేయడం అమానుషమని ఇటువంటి సంఘటనలను తీవ్రంగా ఖండించారు. దాడికి గురైన వారందరూ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారని, దాడిచేసిన ఎమ్మెల్యే వారి అనుచరులపై కేసులు నమోదు చేసి, ఎమ్మెల్యే పదవి నుంచి సస్పెండ్ చేయాలని, ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం అటవీ శశాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌లు తక్షణమే స్పందించి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని, దాడికి పాల్పడిన వారు తమ సిబ్బందికి బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు ఒక ప్రకటనలో కోరారు.

## అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని వినతి



వినతిపత్రం అందచేస్తున్న అంగన్‌వాడి కార్యకర్తలు

**అమడగూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త**

అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటి తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనం పెంచాలని, ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని, మినీ అంగన్‌వాడి కేంద్రాలకు జిఓ ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం 2014 నుండి వేతనాలు పెంచలేదని, పనికి మించి భారం పెరిగిందని 2024లో జీతాలు పెంచుతామని హామీ ఇచ్చారని, ఇచ్చిన సెల్‌ఫోన్లు పనిచేయడం లేదని, నిత్యావసర సరుకులు సరైన సమయానికి రాలేదని, జిఓలు మార్పు చేయాలని, హెల్పర్లకు ప్రమోషన్ గైడెన్స్ రూపొందించాలని ఐసిడిఎస్ సిబ్బందిని చర్చలకు పిలిచి సమస్యలు వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ కార్యకర్తలు సరళ, రమాదేవి, స్వర్ణ, స్వాతి, మమత, జామ్రుత్‌ప్యారి, అనిత, నిర్మల, పద్మ, సునీత, రమాదేవి, సుమతి, గంగాదేవి, గంగా, తదితర ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కన్నులపండువగా బుగ్గరామలింగేశ్వరస్వామి ప్రాకారోత్సవం

**తాడిపత్రిటౌన్, ఆగస్టు 21 ప్రభాతవార్త**



పూజల్లో పాల్గొన్న జె.సి ప్రభాకర్‌రెడ్డి దంపతులు

తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన ఎలసిన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుగ్గరామలింగేశ్వర స్వామి ప్రాకారోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జె.సి ప్రభాకర్‌రెడ్డి దంపతులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మాసశివరాత్రిని పురస్కరించుకుని శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి, శ్రీపార్వతీదేవి అమ్మవారు ఉత్సవ విగ్రహాలను పల్లకిలో వుంచి ఊరేగింపు నిర్వహించారు. శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో కళ్యాణ మండపం జీర్ణోద్ధరణ కార్యక్రమంలో భాగంగా ఈ వేడుకలను అట్టహాసంగా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామికి ఉదయం అభిషేకాలు, అర్చనలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి దశవిధ హారతులు, తదితర ప్రత్యేక పూజలను అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, శంకరయ్యశర్మ, గిరిశర్మ, నందుస్వామిలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వందన డ్యాన్ అకాడమీ చిన్నారులతో భరతనాట్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. అదేవిధంగా వాసవి మహిళా మండలి సభ్యులచేత కోలాటం నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి శివపార్వతులను దర్శించుకున్నారు. వేడుకల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. హాజరైన భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్, కమిటీ సభ్యులు రంగనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కదిరి డిఎం మా గోడు పట్టించుకోండి

**అమడగూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త**

మండలంలోని అమడుగూరు వయా చినగానపల్లి మీదుగా నైట్ హాల్ట్ వస్తున్న చినగానపల్లి బస్సును గతంలో వస్తున్న సమయం ప్రకారం ఆరుసార్లు మా గ్రామానికి వచ్చే విధంగా కదిరి డిఎం చర్యలు తీసుకోవాలని మండల ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 9 గంటలు దాటితే కదిరికి వెళ్లడానికి వయా మహమ్మదాబాద్, ఒడిసి మీదుగా రాకపోకలు చేయడానికి ఆర్టీసి బస్సు సౌకర్యం లేదని కనుక మీరు పంపుతున్న చినగానపల్లి బస్సును అనంతపురంకు పంపకుండా తమ మండలానికి పంపితే మాకు అన్ని విధాలుగా విద్యార్థులకు, తమకు, ఉపాధ్యాయులకు అనువుగా వుంటుందని వారు కోరుతున్నారు.

## ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం నిర్వహించుకుందాం

- శాంతి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే కందికుంట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

**కదిరి, ఆగస్టు 21 ప్రభాతవార్త**

వినాయక చవితి పండుగ పురస్కరించుకొని వినాయక విగ్రహాల ఏర్పాటు, నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో ముస్లిం మత పెద్దలు, పట్టణ పుర ప్రముఖులు, వివిధ శాఖల అధికారులు విగ్రహ ప్రతిష్ట నిర్వాహకులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్డీవో వీవీఎస్ శర్మ, డీఎస్పీ శివ నారాయణస్వామి, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వినాయకుని విగ్రహ ఏర్పాట్లకు అన్ని నిబంధనలు పాటించాలని, సంబంధిత పోలీస్ స్టేషన్లలో అనుమతు తీసుకోవాలన్నారు. వినాయక, విగ్రహ ప్రతిష్ఠ పందిళ్ళు మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి 5 లేదా అంతకంటే ఎక్కువ మంది కమిటీగా ఏర్పడి వారి వివరాలు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లలో తెలపాలన్నారు. ఈ ఏడాది రూ.4.30 కోట్లతో విద్యుత్తు లైన్‌లు ఏర్పాటు చేశామని వెలుగులో విగ్రహాలు ఊరేగింపు కొనసాగుతుందన్నారు. విగ్రహ మండపాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ వద్ద పిల్లలు జాగ్రత్తగా ఉండే విధంగా నిర్వహణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఉత్సవం సందర్భంగా పట్టణంలో ప్లాస్టిక్ నిషేధించి పేపర్ ప్లేట్లు ఉపయోగించి ప్లాస్టిక్ రహిత కదిరిగా ప్రజల సహకరించాలని కోరారు. ఉత్సవాలు తొందరగా నిమజ్జనం జరగడానికి అందరి సహాయ సహకారాలతో విజయవంతం చేయాలని కోరారు. మండపాలలో దీపారాధనల వలన అగ్ని ప్రమాదాలు జరుగకుండా జాగ్రతలు తీసుకోవాలని, విద్యుత్ వైర్లను, కాంతివంతమైన, లైట్ల వినియోగంలో ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ జరుగకుండా విద్యుత్ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఊరేగింపు సమయాలలో ఎక్కడ కులాలు, మతాలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే విధంగా నినాదాలు చేయరాదన్నారు. విగ్రహాలు వారం రోజులపాటు పూజా కార్యక్రమం నిర్వహించడానికి అనుమతులు పొందామన్నారు. పట్టణంలో సీసీ కెమెరాలు పోలీసులు ఆధీనంలో ఉన్నాయని ఎలాంటి గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పెద్దలు విగ్రహ నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నిరుపేద ప్రజల బ్రతుకు బండి ఆర్డిటి

- ఆర్డిటిని రక్షించుకుందాం



ఆర్ ఐ శ్రీనివాసులకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**తలుపుల, ఆగస్టు 21, ప్రభాతవార్త**

కరువుకు కేరాఫ్ గా నిలిచిన ఉమ్మడి అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాలలో ఆర్డిటి నిరుపేదలకు ఒక కల్పతరువు అని అటువంటి ఆర్డిటిని రక్షించుకోవాలని ఆర్డిటి అభిమానులు తాసిల్దార్ కార్యాలయంలో ఆర్,ఐ శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డిటి తలుపుల కన్వీనర్ ఎల్,వి. రమణ మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్డిటి స్థాపించినప్పటి నుంచి నేటి వరకు పేద ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తూ పేద విద్యార్థులకు చదువుతోపాటు వారికి కావాల్సిన బట్టలు, పుస్తకాలు అందజేస్తూ పై చదువుల కోసం ఆర్థిక సహాయం చేసి విద్యను ప్రోత్సహిస్తున్నదన్నారు. నేడు కేంద్ర ప్రభుత్వం ఎఫ్ సి ఆర్ ఏ నిధులు ఆపేయడంతో విద్యార్థుల బ్రతుకులు అధోగతి పాలైతున్నాయన్నారు. పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఎనిమిది లక్షల 50 వేల మందికి ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్నదన్నారు. 3500 గ్రామాలను దత్తత తీసుకొని 3000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి 4,500 మంది పేద కుటుంబాలకు సేవలు అందిస్తున్నది అన్నారు. నిరుపేదలకు 87,000 పక్కా గృహాలను నిర్మించి ఇచ్చిందన్నారు. ఆర్ డి టి సెట్ ద్వారా ఐఐటి విద్యకు ఫీజులను కార్పొరేట్ కాలేజీలకు చెల్లిస్తున్నదని తెలియజేశారు. అంగవైకల్యం కలిగిన వారికి శస్త్ర చికిత్సలు చేసి కృత్రిమ అవయవాలను సైతం అందించి వారికి బ్రతుకులపై ఆశలు పెంచిందన్నారు. బడుగు బలహీన వర్గాలకు గ్రామీణ ప్రాంతాలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి అండగా నిలుస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే ఎఫ్ సి ఆర్ ఏ నిధులను పునరుద్దించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డిటి అభిమానులు పాల్గొన్నారు.

## సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడి కార్యకర్తల నిరసన




నిరసన తెలుపుతున్న అంగన్‌వాడి కార్యకర్తలు

**తాడిపత్రిటౌన్, ఆగస్టు 21 ప్రభాతవార్త**

అంగన్‌వాడి కార్యకర్తలు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న "బ్లాక్ డే" కార్యక్రమంలో భాగంగా గురువారం ఏపీ అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో తాడిపత్రి సెక్టార్‌కు చెందిన అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్లు మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు శంకరమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, ఎఫ్‌ఆర్‌ఎస్ విధానాన్ని రద్దు చేయాలని, నాణ్యమైన మొబైల్ ఫోన్లు అందించాలని, ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాలన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకపోగా, సంక్షేమ పథకాల లబ్ధి కూడా నిరాకరించడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న అంగన్‌వాడీలను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు. తమ డిమాండ్లను అమలు చేయకపోతే ఐసిడిఎస్ కార్యాలయం ముట్టడి వంటి బహిరంగ పోరాట కార్యక్రమాలు చేపడతామని ఆమె హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్టు కోశాధికారి భాగ్యలక్ష్మి, కెవిపిఎస్ నాయకులు రామ్మోహన్, సిఐటియు నాయకులు నరసింహారెడ్డి, ఉమాగౌడ్, అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

## బాబును నమ్మి జనం మోసపోయారు




రుద్రంపేటలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం.

**అనంతపురం రూరల్,ఆగస్టు 21 ప్రభాతవార్త**

నారా చంద్రబాబు నాయుడును నమ్మి జనం మోసపోయారని ఎంపీటీసీ మహబూబ్ బి, ఎం ఎస్ ఎస్ సేవా సంస్థ అధ్యక్షులు సాదిక్ వలి తెలిపారు. అనంత రూరల్,మండలం రుద్రంపేట లో అనంత అర్బన్ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు సైపుల్ల కాలనీలో ఎంపీటీసీ ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం గురువారం నిర్వహించి,ప్రతి గడప గడపకు తిరిగి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్6 హామీలను గాలికి వదిలేశారని చెబుతూ వారు వివరించారు. అధికారంలోకి వచ్చి 13 నెలలు కావస్తున్న ఇచ్చిన హామీలు పూర్తిగా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని, చంద్రబాబు ని నమ్మి ఓటు వేసినందుకు అన్ని వర్గాల ప్రజలుమోసపోతున్నారన్నారు. ఈ విషయాలు అన్నింటిని ప్రజలు అందరూ గమనించి రాబోవు రోజులలో ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో 14వ వార్డ్ నెంబర్ జ్యోతి, కాజా, శిక్షావలి, నాగరాజు, షాషావలి, జయమ్మ పాల్గొన్నారు.

## ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలు సకాలంలో పూర్తి చేయాలి

- సచివాలయ సిబ్బందికి తెలిపిన డిప్యూటీ ఎంపీడీవో,



సచివాలయం ఉద్యోగులతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం రూరల్‌ఆగస్ట్ 21 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన పీ 4 తో పాటు మిగతా సర్వేలు అన్నీ సకాలంలో పూర్తి చేయాలని సచివాలయ ఉద్యోగులకు డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు, కక్కలపల్లి క్లస్టర్ గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శి యు. హిదయాతుల్లా తెలిపారు. గురువారం రుద్రంపేట పంచాయతీలోని సచివాలయం 1 ను ఆయన తనిఖీ చేసి రికార్డును పరిశీలించి అనంతరం సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సచివాల సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాకంగా తీసుకున్న పీ 4 సర్వే తో పాటు మిగిలిన అన్ని సర్వేలను సకాలంలో పూర్తి చేసి మండలాన్ని జిల్లాలోని అగ్రస్థానంలో నిలవాలని తెలియజేశారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- హోమియోపతి వైద్యులు లక్ష్మీ నరసయ్య

**తలుపుల, ఆగస్టు 21, ప్రభాతవార్త**




విద్యార్థులకు హోమియోపతి మందులు అందజేస్తున్న దృశ్యం

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హోమియోపతి వైద్యులు లక్ష్మీ నరసయ్య తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాల యందు విద్యార్థులకు హోమియోపతి వైద్యాన్ని అందించారు ముఖ్యంగా పిల్లలు ఆహారాన్ని భుజించే ముందు శుభ్రంగా చేతులు కడుక్కొని వ్యక్తిగత పరిశుభ్రత పాటించి తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. ముందస్తుగా వ్యాధులు ప్రబలకుండా మందులు పంపిణీ చేశామని వైద్యుడు తెలిపారు. ముఖ్యంగా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని నీటి నిలువలు లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే దోమలు వ్యాప్తి చెంది డెంగు మలేరియా చికెన్ గునియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు. తగు జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు తోకకుండా కాపాడుకోవచ్చని తెలిపారు.

## ఆరె కటిక కార్పోరేషన్ చైర్మన్‌గా హరికృష్ణరావు

**పెద్దవడుగూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త**



ప్రమాణస్వీకారం చేస్తున్న హరికృష్ణరావు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరె కటిక కార్పోరేషన్ చైర్మన్‌గా పెద్దవడుగూరుకు చెందిన హనుమంతకారి హరికృష్ణరావు గురువారం ప్రమాణస్వీకారం చేశారు. విజయవాడలోని బిసి సంక్షేమ భవన్‌లో జెఎండి ఉమాదేవి సమక్షంలో రాష్ట్ర ఆరె కటిక కార్పోరేషన్ చైర్మన్‌గా హరికృష్ణరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా హరికృష్ణరావు మాట్లాడుతూ ఆరె కటిక, బిసి కులాల అభ్యున్నతి కోసంననిష్పక్షపాతంగా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. హరికృష్ణరావు ప్రమాణస్వీకారం చేయడం పట్ల పెద్దవడుగూరు మండల కేంద్రంలోని టిడిపి కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు.

## అంగన్‌వాడి కార్యకర్తల నిరసన



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడి కార్యకర్తలు

**యాడికి, ఆగస్టు 21 ప్రభాతవార్త**

తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడి కార్యకర్తలు బ్లాక్ డే కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని గాంధీజీ విగ్రహం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడి కార్యకర్తలకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, రెండు యాప్‌లను కలిపి ఒకే యాప్ చేయాలని, ప్రభుత్వ పథకాలను అంగన్‌వాడీలకు అమలు చేయాలని, గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వమే ఉచితంగా అమలు చేయాలని, మెనూ చార్జీలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి అంగన్‌వాడి యూనియన్ కార్యదర్శి మహాలక్ష్మి, సెక్టార్ లీడర్స్ జీనత్, రాజ్యలక్ష్మి, పార్వతమ్మ, లక్ష్మీదేవి, అంగన్‌వాడి టీచర్లు పద్మావతి, శివకుమారి, ఆయాలు సునీత, గంగా, సిఐటియు సీనియర్ నాయకులు బషీర్ అహమ్మద్, మాయకుంట్ల మోహన్‌లు పాల్గొన్నారు.

# దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దారుణం..!!

**- పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలి**

**- వైఎస్ఆర్‌సిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి**

గుంతకల్లు, ఆగస్టు 21 ప్రభాతవార్త



ఆర్డీఒ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్ఆర్‌సిపి నాయకులు

దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దారుణమని వైఎస్ఆర్‌సిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి అన్నారు. గురువారం బాధితులతో కలిసి ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీఒ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నైరుతిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలు సాకులతో వేలాదిమంది దివ్యాంగుల పింఛన్లు తొలగించడం బాధాకరమన్నారు. వెరిఫికేషన్ల పేరుతో నియోజకవర్గ వ్యాప్తంగా 1661 పింఛన్లు తొలగించారని మండిపడ్డారు. 15 ఏళ్లుగా పింఛన్లు తీసుకుంటున్న వారివి కూడా నిర్లక్ష్యంగా తొలగించడంతో బాధితులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి రీ వెరిఫికేషన్ చేసి తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని ఆమె డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఒ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జింకల రామాంజనేయులు, పట్టణ అధ్యక్షులు ఖలీల్, నాయకులు పాటిల్ జయరాంరెడ్డి, బాసిద్, వంశీయాదవ్, షాబుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## తొలి సంతకం చేసిన చైర్మన్‌లకు... కాషాయ దళం అభినందనలు

**- పాలకులకు బిజెపి మండల అధ్యక్షుడు లక్ష్మినారాయణ, నియోజకవర్గ కన్వీనర్ బొట్టు శ్రీనివాసులు సన్మానం**

గోరంట్ల, ఆగస్టు 21 ప్రభాతవార్త



చైర్మన్, వైస్ చైర్మన్లను అభినందిస్తున్న బిజెపి నాయకులు

గోరంట్ల మార్కెట్ యార్డ్ కమిటీ పాలకమండలి పదవీ బాధ్యతల సందర్భంగా నూతన చైర్మన్ శైలజ, వైస్ చైర్మన్ తిరుపాల్, పాలక మండలి సభ్యులకు గోరంట్ల మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అభినందనలు తెలియచేశారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు బోయ లక్ష్మినారాయణ, నియోజకవర్గ పార్టీ కన్వీనర్ బొట్టు శ్రీనివాసులు తదితరులు మార్కెట్ యార్డ్ ఆవరణలో జరుగుతున్న పదవీ బాధ్యతల స్వీకార కార్యక్రమం సమావేశంలో చైర్మన్ శైలజ, వైస్ చైర్మన్ తిరుపాల్, బిజెపి నాయకురాలు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రామాంజనమ్మలను గురువారం శాలువాలు, పూలమాలలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో భజంత్రీ శంకర, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్ కమిటీని అభినందించిన... కన్వీనర్ బాలకృష్ణచౌదరి

గోరంట్ల, ఆగస్టు 21 ప్రభాతవార్త



నూతన కమిటీని అభినందిస్తున్న మండల కన్వీనర్

గోరంట్ల మార్కెట్ యార్డ్ పాలకమండలి పదవీ బాధ్యతల స్వీకారం సందర్భంగా పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మార్కెట్ యార్డ్ చైర్మన్ శైలజ వెంకటేష్, వైస్ చైర్మన్ తిరుపాల్‌తో పాటు కమిటీ సభ్యులకు గోరంట్ల మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ బాలకృష్ణచౌదరి పుష్పగుచ్చాలు అందచేసి శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## నూతన బార్ పాలసీ పట్ల అవగాహన

గుత్తి, ఆగస్టు 21 ప్రభాతవార్త



డిప్యూటి కమీషనర్ మాట్లాడుతున్న దృశ్యం

బార్ల కొత్త పాలసీ ప్రకారం వేలం పద్ధతిలో కాకుండా, లాటరీ ప్రకారం కేటాయిస్తామని ఎక్సైజ్ శాఖ డిప్యూటి కమీషనర్ నాగమద్దయ్య పేర్కొన్నారు. స్థానిక సిఐ కార్యాలయంలో గుత్తి మున్సిపాలిటీకి కేటాయించిన బార్ పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా ప్రకారం స్లాబ్ పద్ధతిన రుసుము నిర్ణయిస్తామన్నారు. నిర్వహణ వేళలు ఉదయం 10 నుండి అర్ధరాత్రి 12 వరకు వుంటుందన్నారు. వాయిదాల పద్ధతిన రుసుము చెల్లించే వెసులుబాటు వుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి, స్థానిక సిఐ ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వృద్ధుల దినోత్సవం

గుత్తి, ఆగస్టు 21 ప్రభాతవార్త



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలోని పెన్షనర్ల కార్యాలయంలో గురువారం జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వృద్ధాప్యంలో పిల్లలు వృద్ధులను ఆదరిస్తూ వారిని సంరక్షించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రామ్మోహన్, కుల్లాయిబాబు, లక్ష్మినారాయణ, షెక్షావలి, శామ్యూల్, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాల్లో గొడవలు జరగకుండా చూసుకోవాలి

బత్తలపల్లి, ఆగస్టు 21 ప్రభాతవార్త



పోలీస్ సిబ్బందితో సమావేశమైన ఎస్సై

రానున్న వినాయక చవితి ఉత్సవాలలో గ్రామాల్లో ఎటువంటి గొడవలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్సై సోమశేఖర్ సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన వినాయక ఉత్సవాల నిర్వహణపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ముందస్తు సమాచారం తెలుసుకొని వినాయక ఉత్సవాల నిర్వహణపై సూచనలు సలహాలు అందజేయాలన్నారు. ఎక్కడైనా గ్రామాలలో గొడవలు జరిగే సూచనలు కనిపిస్తే అటువంటివారిని వెంటనే బైండోవర్ చేయాలన్నారు. పోలీసు ఉన్నతాధికారుల సూచనలను సిబ్బంది తప్పకుండా ప్రజలకు తెలియజేసి వినాయక ఉత్సవాలలో ఎటువంటి గొడవలు జరగకుండా చూడాలన్నారు.

# శాంతియుతంగా వినాయక చవితి పండుగ నిర్వహించేందుకు చర్యలు తీసుకోండి...!..

**అధికారులకు ఆర్డీవో మహేష్ సూచనలు..**



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డిఓ మహేష్

ధర్మవరం రూరల్ ఆగస్టు 21 ప్రభాతవార్త

రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని పట్టణ ప్రాంతాల నందు వినాయక చవితి పండుగను ప్రజలందరూ శాంతియుతంగా సాఫీగా జరిగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో గురువారం తహసీల్దార్లు, మున్సిపాలిటీ అధికారులు, పోలీస్ శాఖ, అగ్నిమాపక శాఖ, నీటి సరఫరా శాఖ అధికారుల మరియు గణేశ్ ఉత్సవ సమితుల ప్రతినిధులుతో శాంతి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ శాంతి భద్రతా ఏర్పాట్లు కోసం పోలీస్ శాఖ తగిన బలగాలను మోహరించడం, సీసీ కెమెరాలు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని మున్సిపాలిటీ మరియు నీటి సరఫరా శాఖ తాగునీరు, శుభ్రత, చెత్త తొలగింపు చర్యలకు సంబంధించి మున్సిపాలిటీ శాఖ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అలాగే వినాయక మండపాల వద్ద, నిమజ్జన ప్రదేశాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, తగిన వెలుగులు ఏర్పాటు చేయడం అగ్నిమాపక శాఖ సహకారంతో నిమజ్జన కుంటలు, భద్రతా కంచెలు, లైటింగ్, ప్రాణరక్షణ పరికరాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ మరియు అగ్ని మాపక శాఖ లకు సూచించారు. వైద్యశాఖ తరపున అత్యవసర వైద్య సేవలు, అంబులెన్స్ సౌకర్యాలు సిద్ధంగా వుంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. గణేశ్ ఉత్సవ కమిటీలు పండుగను పర్యావరణ సహిత విగ్రహాలు, శబ్ద కాలుష్యం నివారణ, నిబంధనల ప్రకారం పండుగ విజయవంతంగా జరుపుకోవాలని ఆర్డీవో మహేష్ తెలిపారు.

## చెట్టుకు ఉరివేసుకొని వ్యక్తి మృతి

అమరాపురం ఆగస్టు 21 ప్రభాతవార్త



ఉరివేసుకొని వ్యక్తి మృతి దృశ్యం

మండల పరిధిలోని నాగోనపల్లి గ్రామానికి చెందిన గొల్ల ఉడికి కృష్ణప్ప (59 )సంవత్సరాలు అను వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. మృతుడి బంధువులు పోలీసులు అందించిన సమాచారం మేరకు గత 15 సంవత్సరాల నుండి వెన్నెముక నొప్పితో బాధపడుతుండేవాడని ,సదరు నొప్పికిఅమరాపురం, పావగడ ,తుమకూరు, దావనగెరే, లలో డాక్టర్లవద్ద చికిత్సలు చేయించినారని, నయం కాలేదని, జీవితముపై విరక్తి చెంది తన పొలము ప్రక్కన ఉన్న కుబేరప్ప పొలములో ఉన్న తుగ్గలి చెట్టు కొమ్మకు ఉరి వేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య అయిన సన్నిరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అమరాపురం పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ రామాంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## గుండెపోటుతో వైఎస్సార్సీపీ కార్యకర్త మృతి నివాళులర్పించిన మండల నేతలు

బత్తలపల్లి, ఆగస్టు 21 ప్రభాతవార్త



లోక్నాథ్ రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు



లోక్నాథ్ రెడ్డి ఫైల్ ఫోటో

గుండెల్లో మంట, నొప్పిగా ఉందంటూ ఆసుపత్రికి తరలిస్తుం డగానే వైఎస్సార్సీపీ కార్యకర్త లోక్ నాథ్ రెడ్డి(51) గుండె పోటుతో గురువారం మృతి చెందాడు. మండలంలోని లింగా రెడ్డిపల్లి గ్రామానికి చెందిన లోకనాథ్ రెడ్డి వ్యవసాయపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గ్రామంలో అందరితోనూ ఆప్యాయంగా కలిసి మెలిసి ఉండేవాడు. గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు బొంతల నారాయణస్వామి కుమారుడి వివాహానికి సంజీవపురం సమీపంలోని కాటమయ్య కొండ వద్దకు వచ్చి, అందరితో కలివిడిగా ఉన్నాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన లోకనాథరెడ్డి గుండెల్లో మంటగానూ, నొప్పిగా ఉందంటూ చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆర్డిటి ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరుకున్నాక వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య సుహాసినితో పాటు కుమారుడు. కుమార్తె ఉన్నారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్డీస్ మండల నేతలు గ్రామానికి చేరుకుని మృత దేహంపై పూలమాలలు వేసి. నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని సూచించారు పరామర్శించిన వారిలో వైఎస్సార్సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గసభ్యులు కమతం ఈశ్వరయ్య జిల్లా అధికార ప్రతినిది. గుర్రం శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్, మడల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజి కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, పలువురు నాయకులు. కార్యకర్తలు ఉన్నారు.

## సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగాల నియామకంలో పారదర్శకత పాటించాలి. యుటిఎఫ్ డిమాండ్.



యుటిఎఫ్ సంఘ నాయకులు

**కొత్తచెరువు ఆగస్టు 21 ప్రభాతవార్త.**

శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి సర్వ శిక్ష అభియాన్ లో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టుల భర్తీ కోసం నియమ నిబంధనలను పాటించలేదని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న వివిధ కేటగిరీల కు సంబందించిన 10 రకాల పోస్టుల కొరకు జిల్లాలో మొత్తం 120 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారనీ. ఆ పోస్టుల నియామకం కోసం గురువారం జరుగుతున్న మౌఖిక పరీక్ష నందు అర్హత సాధించిన 34 మంది అభ్యర్థుల మార్కులను బహిర్గతం చేయకుండా ఇంటర్వ్యూ లు నిర్వహించడం అధికారులు ,అక్రమ మార్గాలకు తవిచ్చినట్లే అవుతుందని యుటిఎఫ్ సత్య సాయి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తీవ్రంగా ఖండించారు. నియమానిబంధనలు పాటించకుండా అభ్యర్థులకు కేటాయించిన అర్హతా మార్కులకు 85కుగాను ఎన్ని మార్కులు వచ్చినవో బహిర్గతం చేయకుండా గురువారం బుక్కపట్నం డైట్ కాలేజ్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించడం అనేక అనుమానాలకు, తావిస్తున్నదన్నారు. ఈ ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థుల మార్కులు బహిర్గతం చేయకుంటే ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేయడానికి వెనుకాడమని యు. టీ. ఎఫ్. సత్య సాయి జిల్లా శాఖ పక్షాన తెలియచేస్తున్నామనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ,జిల్లా అధ్యక్షులు, శెట్టిపి జయ చంద్రా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు, నారాయణ స్వామి, లక్ష్మి నారాయణ, రామకృష్ణ నాయక్, రామాంజినేయులు నాయకులు జనార్దన్, మధుసూదన్, రెడ్డి రాజేష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయం ద్వారా పర్యావరణ పరిరక్షణ..!

**-వ్యవసాయశాఖ ఉరవకొండ సహాయ సంచాలకులు ఎస్.సత్యనారాయణ**

**-ఆర్ఎస్‌కే సిబ్బందికి ఏపీసీఎన్ఎఫ్‌పై ప్రారంభమైన 3 రోజుల శిక్షణ**

ఉరవకొండ, ఆగస్టు 21 ప్రభాతవార్త



ఆర్ఎస్‌కే సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఏడీఏ ఎస్.సత్యనారాయణ

ప్రకృతి వ్యవసాయం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షిస్తూ జీవనోపాధులను మెరుగుపర్చుకోవచ్చని వ్యవసాయ శాఖ ఉరవకొండ సహాయ సంచాలకులు ఎస్.సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఉరవకొండ డివిజన్‌లోని 4 మండలాల్లోగల రైతు సేవా కేంద్రాల సిబ్బందికి రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ న్యాచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) 3 రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏడీఏ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు స్థిరమైన రసాయన రహితమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడమే ఏపీసీఎన్ఎఫ్ ముఖ్య ఉద్దేశమన్నారు. కమ్యూనిటీ నేతృత్వ విధానం ద్వారా వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లడం రైతుల సామర్థ్య నిర్మాణం, శిక్షణ, క్షేత్ర సందర్శన, తెలుసుకున్న విషయాలను ఒకరినొకరు పంచుకోవడం లాంటివి ప్రోత్సహించాల్సి ఉంటుందన్నారు. స్థానిక వనరులు, సాంప్రదాయ పద్ధతులను వినియోగించుకోవడం జీవో, ఎన్‌జీవోలతో కలిసి పనిచేసి లక్ష్యాన్ని పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. చిన్న, మధ్యతరగతి రైతులను ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పెంచడంచేత ఆరోగ్యం, జీవవైవిధ్యం, పర్యావరణ వ్యవస్థలను మెరుగుపర్చి రైతులకు ఆదాయం, జీవనోపాధులకు భద్రత పెంపొందించాల్సి ఉంటుందన్నారు. రసాయన వినియోగం, పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడం ముఖ్య ఉద్దేశమన్నారు. రైతుల్లో శిక్షణ, సామర్థ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలు, ఆదర్శ క్షేత్రాలు సందర్శన, మార్కెటింగ్, ధర అభివృద్ధిని ప్రోత్సహించాల్సి ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ జీవామృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం వంటి పదార్థాలను తయారు చేసుకునే పద్ధతుల గురించి ఆర్ఎస్‌కే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈనెల 15న జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న పెద్దముష్టూరు వీఏఏ పి.రాధికను శాలువాకప్పి పూలమాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ, విడపనకల్లు, గుంతకల్లు ఏవోలు రామకృష్ణుడు, పెన్నయ్య, లీనా వసుంధర తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాలవద్ద, నిమజ్జన సమయంలో డీజేలకు అనుమతిలేదు

**-రెండు రోజుల్లో ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ పూర్తీ చేసుకోవాలి**

**-వినాయక ఉత్సవ సమితులతో సమావేశంలో సీఐ బి.మహానంది**

ఉరవకొండ, ఆగస్టు 21 ప్రభాతవార్త

వినాయక మండపాలవద్ద, నిమజ్జన సమయంలో డీజేలకు అనుమతి ఇవ్వడం జరుగదని యుపీఎస్ సీఐ బి.మహానంది స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని వీరశైవ కళ్యాణ మండపంలో వినాయక ఉత్సవ సమితులతో సమన్వయ సమావేశం నిర్వహించి నియమ నిబంధనలకు తెలియజేశారు. సీఐ బి.మహానంది మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు ఈ వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో అన్‌లైన్‌లో అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తీ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తరువాత మండప స్థలాన్ని తాము తనిఖీ చేసి నిబంధనల ప్రకారం ఉంటే ఎన్‌వోసీ జారీ చేయడం జరుగుందన్నారు. వినాయక మండపాలను రోడ్డు మధ్యలో కాకుండా రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఒక పక్కకు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వినాయక మండపాలకు విద్యుత్ వినియోగంపై విద్యుత్‌శాఖ అధికారులను సంప్రదించి తప్పక అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. మండపాలవద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జనం, విగ్రహాలను ఊరేగింపుగా మండపాలకు తరలించే సమయంలో డ్రైవింగ్ లైసెన్సులు కల్గినవారే వాహనాలు నడపాల్సి ఉంటుందన్నారు. నిబంధనలు, సూచనలు తప్పక పాటించి 27న మొదలయ్యే వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి.జనార్ధననాయుడు, పీఎస్ఐ డి.అమీర్‌ఖాన్ సిబ్బంది పాల్గొన్నారు.

## హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణపై అవగాహన సదస్సు



వాచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అగళి, ఆగస్టు 21 ప్రభాతవార్త

రొళ్ల ప్రభుత్వఉన్నత పాఠశాలలో ఐబిపి క్యాంపెయిన్, హెచ్ఐవి ఎయిడ్స్ నివారణపై అవగాహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర ఏయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నేత్ర సంస్థ సత్యసాయిజిల్లా ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఐఇసి అవగాహనను రొళ్ల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థుళతోపాటు సిబ్బందికి హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి ఎలా సోకుతుంది, వ్యాపించకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి, హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులపట్ల వివక్షత, చిన్న చూపు లేకుండా ఎలా కలిసి మెలసి జీవించాలి, హెచ్ఐవి ఎయిడ్స్ క్షయవ్యాధి సంబంధం గురించి, సుఖ వ్యాధులు, చికిత్స గురించి వివరించారు. హెచ్ఐవి ఎ యిడ్స్ యాక్ట్ 2017 ఆర్ట్ మందులు ఏపి ఎస్ఏసిఎస్ యాప్ టోల్‌ఫ్రీ నెంబర్ 1097 గురించి వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ బదిరీష్, ఫోర్డ్ ప్రాజెక్టు డైరెక్టర్ అశ్వర్థనారాయణ, ఓఆర్‌డబ్ల్యూ రంగలక్ష్మి, పద్మ, సిద్దరంగమ్మ, సింధు, హెచ్ఎం రవికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## యువకుడు దారుణ హత్య..

ధర్మవరం రూరల్ ఆగస్టు 21 ప్రభాతవార్త



హత్యకు గురైన మృతుడు ధనుంజయ

పట్టణంలోని సిద్దయ్యగుట్ట వద్ద గల అన్నా క్యాంటీన్ సమీపంలో పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన పాల్యం ధనుంజయ (27 సంవత్సరాలు) బుధవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు డిఎస్పి హేమంత్ కుమార్ తో పాటు వన్ టౌన్ సిఐ నాగేంద్రప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకొని హత్య చేయబడిన స్థలాన్ని వారు పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ధనుంజయ మెకానిక్ వృత్తి చేసుకుంటూ జీవనాన్ని కొనసాగించేవాడని వన్టౌన్ సీఐ తెలిపారు. సిమెంటు ఇటుక పెళ్ల తో తీవ్రంగా దాడి చేయడంతో మృతి చెందడం జరిగిందని తెలిపారు. హత్య గావింపబడ్డ ధనుంజయకు ఎవరైనా శత్రువులు ఉన్నారా? పథకం ప్రకారం చేశారా? అన్న కోణంలో విచారణ చేస్తున్నామని మృతుడి కి వివాహం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు మరిన్ని వివరాల సేకరించి విచారణ వేగవంతం చేసి హత్య పాల్పడిన వారిని త్వరలో పట్టుకుంటామని ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు వన్ టౌన్ సిఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

# సచివాలయ సిబ్బంది గైర్హాజరు

**ఉన్నతాధికారులు పర్యవేక్షణ లోపం**

గుమ్మఘట్ట ఆగస్టు 21 ప్రభాతవార్త



అరకొర హాజరుతో సచివాలయం సిబ్బంది

సచివాలయ ఉద్యోగులు ఏ సమయానికి వస్తారు వెళ్తారో తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ప్రస్తుతం గ్రామాల్లో గ్రామ సచివాలయం ద్వారా ప్రజలకు వేగంగా ప్రజాసేవలు అందించాలని కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కృషి చేస్తుంది అయితే సచివాలయ సిబ్బంది గైర్హాజరుపై ప్రజాసేవలు ప్రజలకు వేగంగా ఎలా అందజేస్తారు???కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినది సూపర్ సిక్స్ పథకాలు సూపర్ గా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కూటమి ప్రభుత్వం ఆలోచన చేస్తుంది ఇప్పటికే సూపర్ సిక్స్ లో భాగంగా అనేకమైనటువంటి పథకాలు ప్రజలకు చేరవేసింది గ్రామ సచివాలయం ద్వారా ప్రజలకు కావలసిన ధ్రువపత్రాలను గ్రామ సమస్యల ను పరిష్కరించుటలో గ్రామ సచివాలయం ఉద్యోగులు ద్వారా ప్రజలకు కృషి చేస్తుంది అయితే ఉద్యోగులే గైర్హాజరు అయితే ప్రజాసేవలు ఎలాగూ సులభతరం అవుతాయి అని గైర్హాజరు మరియు సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఇటువంటి అధికారులు వల్ల కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది ఉన్నతాధికారులు పర్యవేక్షణా లోపం కారణంగానే ఈ విధంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు వివరాలు గుమ్మఘట్ట మండలం గలగల గ్రామంలోని గురువారం సచివాలయంలో ఎనిమిది మంది సిబ్బంది లో సచివాలయ సిబ్బంది కేవలం నలుగురు మాత్రమే ఉండటం గమనార్హం వీఆర్వో మంజునాథ సచివాలయానికి రాకుండా విధులకు డుమ్మా కొట్టి ఇష్టానుసారంగా వ్యవహరిస్తు విధులకు గైర్హాజరయ్యారు వీఆర్వో మంజునాథ తో ప్రభాతవార్త వాకబు చేయగా ఈరోజు నేను డ్యూటీకి రాలేదు ఇంట్లోనే ఉన్నాను ఏమైనా సమస్య ఉంటే రేపు వస్తాను అంటూ సమాధానమిచ్చారు ఈ విషయంపై తహశీల్దార్ రజాక్ వలి ని వివరణ కోరగా ప్రజలుకు అందుబాటులో ఉండి సేవలందించాల్సిందేనా దగ్గర పర్మిషన్ తీసుకోలేదు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాల్సిందే విధులకు గైర్హాజరైతే ఉపేక్షించేది లేదు శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు

## రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక అవడం పట్ల హర్షం

అగళి, ఆగస్టు 21 ప్రభాతవార్త



హర్షం వ్యక్తం చేస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

రొళ్ల డా.బిఆర్. అంబేద్కర్ గురుకులానికి చెందిన విద్యార్థులు క్రికెట్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ఎంపిక అవడం పట్ల ప్రిన్సిపాల్ మైలారప్ప, సిబ్బంది హర్షం వ్యక్తం చేసి, విద్యార్థులను అభినందించారు. అనంతపురం పిటిసి గ్రౌండ్‌లో జరిగిన లెదర్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో తుది పోరులో కర్నూలు జిల్లా డోన్ జట్టుపై రొళ్ల మండలం అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు విజయం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికవ్వడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు. గెలుపొందిన విద్యార్థుల జట్టుకు మెమెంటో, కప్పును అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో బెస్ట్ బౌలర్‌గా హర్ష వర్దన్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా మనోహర్, ఆల్ రౌండర్‌గా వరుణ్ సందేష్ జిల్లా స్థాయిలో నిలిచి, రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల పిడి తెలిపారు. ప్రతిభ కనబర్చినందుకు విద్యార్థులను అభినందించారు.

## కొత్త కమిటీ లక్ష్యం మార్కెట్ డెవలప్మెంటే

**వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి నూతన పాలక వర్గం కృషి**

**బాధ్యతలు చేపట్టిన నూతన వ్యవసాయ కమిటీ**

గోరంట్ల ఆగస్టు 21 ప్రభాతవార్త



నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మండల కన్వీనర్ బృందం.

కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖా మంత్రి ఎస్ సవితమ్మ ఆదేశాల మేరకు నూతన గోరంట్ల వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ కొలువు తీరింది, ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా సోమందేపల్లి శైలజ వెంకటేష్, వైస్ చైర్మన్ గా గౌని వారి పల్లి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ తో పాటు డైరెక్టర్లుగా అమర్నాథ్, రవి నాయక్, రామాంజనమ్మ, దేవాంగం శ్రీనివాసులు, నరేష్, తిప్పన్న, అమ్మజాన్ చాంద్ భాష, ఆరని గోపాల్ లు బాధ్యతలు చేపట్టారు, ఈ సందర్భంగా గోరంట్ల వ్యవసాయ మార్కెట్ యార్డ్ గోరంట్ల మండలం తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి ఆధ్వర్యంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యుల చేత వ్యవసాయ మార్కెట్ యార్డ్ సెక్రటరీ కిషోర్ కుమార్ సంతకాలు చేయించి బాధ్యతలు అప్పగించారు, వారికి ఘనంగా సత్కరించారు, అనంతరం నూతన చైర్మన్ వైస్ చైర్మన్లు మాట్లాడుతూ రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు రైతులకు అన్ని సహాయ సహకారాలు అందిస్తామని మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు, గతంలో ఎన్నడూ లేనివిధంగా మౌలిక వసతులు కల్పిస్తామన్నారు, ఈ కార్యక్రమంలో మండల మాజీ కన్వీనర్ సోమశేఖర్, మాజీ ఎంపిపి నిమ్మల విద్య ధరణి, మాజీ సర్పంచ్ నరేష్ కుమార్, మాజీ కో ఆప్షన్ మెంబర్ షేక్ అజ్మతుల్లా, గిరిధర్ గౌడ్, ఉత్తమరెడ్డి, నిమ్మలశ్రీధర్, సింగిల్‌విండో చైర్మన్‌లు చందమూరి గోపాల్‌రెడ్డి, బెల్లాల చెరువు చంద్ర, రవిమోహన్, నిడిమామిడి, మనోహర్, డైరెక్టర్ నబీరసూల్, జనసేన సంతోష్ కుమార్, బిజెపి అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ, బొట్టుశ్రీనివాసులు, వెంకటరెడ్డి, కురుబమహేంద్ర, మల్లికార్జున, నరసింహులు, నాగభూషణం, శ్రీనివాసులు, సూపర్‌వైజర్‌లు చంద్ర నాయక్, ఓబులేసు, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## కెజిబివి పాఠశాలలో సిసి కెమెరాలను ఏర్పాటు

గుడిబండ ఆగస్టు 21 ప్రభాతవార్త



చిగతుర్పి మంజునాథ్

మండల పరిధిలోని కరికెర కస్తూరీ బా గాంధీ పాఠశాలకు చిగతుర్పి మంజునాథ్ సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇటీవల కస్తూరీ బా గాంధీ పాఠశాలలో విద్యార్థినీయుల భద్రతపై శక్తి టీం పోలీసులు లోపాలను గుర్తించి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకుడు చిగతుర్పి మంజునాథ్ బాలికల భద్రత కోసం తన సొంత ఖర్చులతో దాదాపు 30 వేల రూపాయల విలువ చేసే సిసి కెమెరాలను పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఓ రమాదేవి మాట్లాడుతూ విద్యార్థినుల భద్రత కోసం పాఠశాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసిన చిగతుర్పి మంజునాథ్‌కు పాఠశాల తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు.

## సిబ్బంది సమయపాలన పాటించాలి



కమీషనర్ తనిఖీ చేస్తున్న దృశ్యం

గుత్తి, ఆగస్టు 21 ప్రభాతవార్త

సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించి విధులు నిర్వహించాలని మున్సిపల్ కమీషనర్ జబ్బార్‌మియా పేర్కొన్నారు. స్థానిక 8వ సచివాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ పథకాలు, సర్వేలు, పన్నుల వసూళ్లు, తదితర నెలవారి నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. తదుపరి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ సతీష్ కమలాకర్, రెవిన్యూ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పట్నం ఎస్ఐపై కేసు నమోదు

గుత్తి, ఆగస్టు 21 ప్రభాతవార్త

సత్యసాయి జిల్లా పట్నం ఎస్ఐ రాజశేఖర్‌పై స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. వివరాలు ఇలా వున్నాయి. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన ఓ మహిళ తన సోదరి కుటుంబ సమస్య పరిష్కారం నిమిత్తం ముదిగుబ్బకు వెళ్ళింది. అక్కడ ఎస్ఐ రాజశేఖర్‌ను కలిసింది. తదుపరి తరుచూ ఎస్ఐతో మాట్లాడేది. అప్పటినుండి అతను ఫోన్ ద్వారా తనకు మానసికంగా లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నాడని ఆమె స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో సదరు ఎస్ఐపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ, ఐటీ, వేధింపుల కేసును నమోదు చేశారు. అర్బన్ సిఐ వెంకటేశ్వర్లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆధార్ స్పెషల్ మేళాను సద్వినియోగం చేసుకోండి

అగళి, ఆగస్టు 21 ప్రభాతవార్త

అగళి ఎంపిడిఓ ఆదేశాల మేరకు ఉన్నత పాఠశాల అగళిలో ఆధార్ స్పెషల్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు కృష్ణమూర్తి రాజు, చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ విద్యార్థులకు మాత్రమే అని తెలిపారు. ఈ నెల 22, 23 రెండు రోజులు ఈ స్పెషల్ మేళా జరుగునని, ఆధార్ లేనివారు, ఆధార్‌కు అప్లై చేసుకునేవారు, ఆ పాఠశాల హెచ్‌ఎంను, టీచర్‌తోపాటు వచ్చి ఈ ప్రాసెస్‌లో కంప్లీట్ చేసుకోవాలన్నారు. తల్లికి వందనం స్కీమ్‌లో ఆధార్‌లేని బడి పిల్లలను తీసుకొచ్చి ఈ స్పెషల్‌డ్రైవ్‌లో దానిని సరి చేసుకోవాలన్నారు. ఆధార్‌లేని పిల్లలు పాఠశాలలో ఉంటే ఆ బాధ్యత ప్రధానోపాధ్యాయులది, టీచర్లదో అని ఎంఈఓలు తెలిపారు.

## మహిళలకు చెక్కులను పంపిణీ చేసిన మాంచూ ఫెర్రర్

శెట్టూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పేదరికాన్ని పారద్రోలిపేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే ఆర్డీటీ ముఖ్య ఉద్దేశ్యం అని ఆసంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మంచో ఫెర్రర్ వ్యాఖ్యానించారు. మండల కేంద్రంలో స్థానిక ఆర్డీటీ మహిళా కో ఆపరేటివ్‌బ్యాంక్‌నందుమహిళలకు మంజూరు చేసిన రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమం ఆర్డీటీ సిబ్బంది ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు గా ఆర్డీటీ మేనేజింగ్ డైరెక్టర్ మాంచో ఫెర్రర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీటీ వ్యవస్థాపకులు దివంగత ఫాథర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి స్మరించుకొని ఉజ్వాలా మహిళా కో ఆపరేటివ్ బ్యాంక్ ను సందర్శించారు. అనంతరం ఆసంస్థ మేనేజ్నిగ్ డైరెక్టర్ మంచో ఫెర్రర్ మాట్లాడుతూ...మహిళలు మహారాణులుగాఎదగాలంటే ముందుగా ఆర్థిక పురోగతిని సాధించాలన్నారు. ఆర్డీటీసంస్థ పేదలకు అందించే ప్రతి పథకం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేదప్రజలు జీవితాల్లో సరిక్రొత్త మార్పు రావాలనే ఫాదర్ విన్సెంట్ఫెర్రర్ ఆశయస్ఫూర్తితో ముందుకెళ్లాలన్నారు. అనంతరం మొత్తం 57,10,000రూపాయల రుణాలను మంజూరు చేసి 188చెక్కులను ఆర్డీటీమేనేజింగ్ డైరెక్టర్ మాంచూ ఫెర్రర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం రీజనల్ డైరెక్టర్ సుబ్బారావు, ఏటియల్, సుశీలమ్మ, సీఓ, లక్ష్మీ, అధ్యక్షులు జయమ్మ, ఉపాధ్యక్షులు గంగమ్మ, సెక్రటరీ భారతి, జాయింట్ సెక్రటరీ కామాక్షి, కోశాధికారి అనుమక్క, మేనేజర్ లావణ్య, కోఆర్డినెటర్లు, వరలక్ష్మి, లక్ష్మిదేవి, ఆర్డీటీ జెఏసి సభ్యులు పాల్గొన్నారు.

## జ్యోతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల అనుమతులు రద్దు చేయండి

-ఎంఈవోకు విన్నవించిన ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు

ఉరవకొండ, ఆగస్టు 21 ప్రభాతవార్త



ఎంఈవో హెచ్.ఈశ్వరప్పకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

రేకుల షెడ్లలో నడుస్తున్న జ్యోతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల అనుమతులు రద్దు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) జిల్లా అధ్యక్షులు బి.నందు, కార్యదర్శి సి.సిద్ధు తదితరులు కోరారు. గురువారం ఈ మేరకు వారు స్థానిక మండల వనరుల కేంద్రంలో మండల విద్యాధికారి హెచ్.ఈశ్వరప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేకుల షెడ్డులో నడుస్తున్న, విద్యార్థులకు భద్రతలేని పాఠశాలకు విద్యాశాఖ అధికారులు ఎలా అనుమతిస్తున్నారో అర్థం కావడంలేదన్నారు. అంతే కాకుండా పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా అబాకస్ కోర్సులు నిర్వహిస్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణం విచారణ జరిపి అనుముతులు రద్దు చేయాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కె.తరుణ్‌కుమార్, పి.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్ణానందస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

-గురుపుష్య యోగ కాలం సందర్భంగా అభిషేకాలు

ఉరవకొండ, ఆగస్టు 21 ప్రభాతవార్త



పట్టణంలోని రేణిమాకులపల్లి రోడ్డులోగల భువనేశ్వరి ఆలయంలోని మహద్గురు పూర్ణానందస్వామి వారికి స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం శ్రావణ మాసం త్రయోదశి గురువారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు కొనసాగాయి. గురు పుష్యకాలం సందర్భంగా పూర్ణానంద స్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి పూజలు మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మెన్ గవ్వల సోమశేఖర్, కమిటీ సభ్యులు రమేష్, బసవరాజు, దాస నాగభూషణం, బాబు తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా బీబీ జైనబ్బీ అమ్మవారి 'ఉరుసు' ఉత్సవం

- అర్ధరాత్రి షంషేర్ ఊరేగింపు, పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు
- కొనసాగిన ఖవ్వాలి పోటీలు, నేడు జియారత్ మహోత్సవం

ఉరవకొండ, ఆగస్టు 21 ప్రభాతవార్త



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

ఉరవకొండ పట్టణంలోని హాజరత్ బీబీ జైనబ్బీ రహంతుల్లా అలైహా వారి ఉరుసు మహోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. బుధవారం నుండి ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా అర్ధరాత్రి 12 గంటలు దాటిన తరువాత పామిడి బాషుసాబ్ అంగడి నుండి షంషేరు శుభ్రపరిచి రాయదుర్గం బుడెన్‌సాబ్ ఇంటి నుండి తాషా వాయిద్యాలతో ఊరేగింపుగా దర్గా చేరుకుంది. ఉరుసు సందర్భంగా అమ్మవారి దర్గాను ఉదయం నుండి రాత్రి వరకు మతాలకు అతీతంగా హిందూ, ముస్లీం భక్తులు సందర్శించి అమ్మవారి సమాధిని దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కొర్కెల గాజులు సమర్పించారు. దర్గా ఆవరణంలో పెద్దఎత్తున గాజులు, ఆటబొమ్మలు, గృహోపకరణాల దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జియారత్ కార్యక్రమం జరుగనుండగా మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి అనవాయితీ ప్రకారం చాదర్‌ను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారి సమాధిపై కప్పి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. రాత్రి 1గంటకు దర్గాలోఅమ్మవారి జియారత్ ఫాతెహా జరిపి భక్తులకు ప్రసాదంపంపిణీ చేయనున్నారు. ఉరుసు కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షులు హోతూరు బాషా, ఉపాధ్యక్షులు బ్యాళ్ళ ప్రసాద్, అసోసియేట్ ప్రసిడెంట్ పామిడి జాకీర్, కార్యదర్శి జి.యం.ఎస్. షాకీర్, జాయింట్ సెక్రెటరీలు గంగవరం శర్మాస్‌వలి, కణేకల్ యూసూఫ్, కోశాధికారి జండా జిలాన్‌బాషా, సహ కోశాధికరి బేల్దార్ శర్మాస్, టీమ్ మేనేజర్ బళ్లారి సాదిక్, సలహా సభ్యులు సభ్యులు మెకానిక్ కె.అబ్దుల్ రెహమాన్, బొంబాయిసేట్ మోయినుద్దీన్, డైరెక్టర్లు అయ్యార్‌బాబా, సి.ప్రభాకర్, ఎస్.ఇర్ఫాన్, జి.నబీరసూల్, తాజుద్దీన్, ఎ.ఆసీఫ్, కె.ఫారుక్, యన్.సాయిక్రిష్ణ, కె.మహేష్, సిలార్ శర్మాస్‌వలి, జి.నూర్‌మహమ్మద్ తదితరులు పాల్గొనగా ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

## హాథిరాం బాబా మఠం ఆస్తుల పరిరక్షణకై 23న ఛలో తిరుపతి

-బంజారా సంఘం నాయకులు ఎస్.కె.సుబ్రమణ్యం నాయక్

ఉరవకొండ, ఆగస్టు 21 ప్రభాతవార్త



విలేఖరులతో మాట్లాడుతున్న ఎస్.కె.సుబ్రమణ్యం నాయక్

బంజారాల ఆరాధ్య దైవం హాథిరాం బాబా మఠం ఆస్తుల పరిరక్షణకు ఈనెల 23న ఛలో తిరుపతి కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని ఈ కార్యక్రమంలో అందరూ తరలిరావాలని బంజారా సంఘం నాయకులు ఎస్.కె. సుబ్రమణ్యం నాయక్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన ఉరవకొండలో విలేఖరులతో మాట్లాడారు. హాథిరాం బాబా వెంకటేశ్వరస్వామితో పాచికలాడి గెలుపొందిన చారిత్రక పురుషులని ఆయన స్థాపించిన మఠానికి వేలకోట్ల రూపాయల ఆస్తులు ఉన్నాయన్నారు. సదరు మఠం ఆస్తులు బంజారాలకు చెందకుండా అనేక కుట్రలు జరుగుతున్నాయని, మఠాన్ని కూల్చివేయడానికి ప్రభుత్వం ప్రయతి ్నంచడం సరైంది కాదన్నారు. హాథిరాం బాబా మఠం ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయని ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పందించాలన్నారు. 15 కోట్ల మంది బంజారాల ఆరాధ్య దైవమైన హాథిరాం బాబా మఠం ఆస్తుల పరిరక్షణకు బంజారా ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు, మేధావుఉల, సామాజిక అభ్యుదయవాదులు తరలిరావాలని ఎస్.కె.సుబ్రమణ్యంనాయక్ కోరారు.

## లక్ష్మినరసింహస్వామిను దర్శించుకున్న వై.ప్రణయ్‌రెడ్డి దంపతులు

-సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించిన అర్చకులు

ఉరవకొండ, ఆగస్టు 21 ప్రభాతవార్త



లక్ష్మినరసింహస్వామిను దర్శించుకొంటున్న నూతన వధూవరులు వై.ప్రణయ్‌రెడ్డి, సాయి రోహిత

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇంచార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి, సాయి రోహిత దంపతులు గురువారం మండల పరిధిలోని పెన్నహోబిళ క్షేత్రంలో కొలువైన లక్ష్మినరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం తన తల్లి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సతీమణి వై.భువనేశ్వరి ఇతర కుటుంబ సభ్యులతో కలిసి వై.ప్రణయ్‌రెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించారు. ఈ సందర్భంగా అర్చకులు ద్వారకనాధాచార్యులు, బాలాజీ నూతన వధూవరులను షాలువాలుకప్పి పూలమాలలతో సన్మానించి స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు. ఈనెల 14న వై.ప్రణయ్‌రెడ్డి వివాహం జరిగిన విషయం తెలిసిందే.

## మరోమారు అదుపుతప్పిన ఉషోదయ పాఠశాల బస్సు..!

-పక్షం రోజుల్లో ఇది రెండవ ప్రమాదం

-సురక్షితంగా బయటపడ్డ విద్యార్థులు

ఉరవకొండ, ఆగస్టు 21 ప్రభాతవార్త




అదుపుతప్పిన ఉషోదయ పాఠశాలకు చెందిన బస్సు

పట్టణంలోని ఉషోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన బస్సు గురువారం మరోవారు అదుపు తప్పింది. పీసీ ప్యాపిలి వైపు నుండి విద్యార్థులను ఎక్కించుకొని పాఠశాలకు వెళుతున్న సమయంలో బస్సు పట్టణంలోని సీవీవీ నగర్ ప్రాంతంలో ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు పక్కన దూసుకెళ్లి ఆగిపోయింది. దీంతో ఏం జరిగిందో అర్థంకాక అందులోవున్న పదుల సంఖ్యలో విద్యార్థులు కేకలు పెట్టారు. కొందరు విద్యార్థులు స్వల్పంగా గాయపడినట్లు సమాచారం. డ్రైవర్ సరైన జాగ్రత్తలు పాటించకువడా నిర్లక్ష్యంగా బస్సు నడిపిన ఫలితంగానే ప్రమాదం జరిగిందని బస్సు బోల్తా పడటమో లేక దేన్నైనా ఢీకొనడమో జరిగివుంటే ఆ ఘోరాన్ని ఊహించలేమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇదే పాఠశాలకు చెందిన బస్సు దాదాపు పక్షం రోజుల క్రితం విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామంవద్ద కూడా అదుపుతప్పగా కొందరు విద్యార్థులు గాయపడిన విషయం తెలిసిందే. ఒకే పాఠశాలకు చెందిన బస్సులు తరచూ ప్రమాదాలకు గురవుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. యాజమాన్యం కండీషన్‌లోగల బస్సులను అనుభవం కల్గిన డ్రైవర్లతో నడపాలని వారు కోరుతున్నారు.

## ఆమిద్యాలలో ఘనంగా ఉట్ల పరుషోత్సవం

-లక్ష్మినరసింహస్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు

ఉరవకొండ, ఆగస్టు 21 ప్రభాతవార్త



ఉట్లమాను ఎక్కుతున్న భక్తులు

మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామంలో స్వస్తి శ్రీ విశ్వావసునామ సంవత్సరం శ్రావణ శుద్ధ త్రయోదశి గురువారం సాయంత్రం ఉట్ల పరుషోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. సాయంత్రం స్థానిక పెన్నహోబులేసుని ఆలయంలో భద్రపరిచిన శ్రీదేవీ, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి దేవాలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు పర్యవేక్షణలో గ్రామంలో ఊరేగించి అర్చకులు గుండుస్వామిచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్లమానుకు బంకమట్టిని పూసి పూజలు జరిపారు. ఉట్లమాను ఎక్కే భక్తులు మేళతాళాల నడుమ ఉట్లమానువద్దకు చేరుకొని అభ్యంగన స్నానంచేసి ఉట్లమానును ఎక్కి ఉట్టికొట్టారు. ఈ కార్యక్రమం ఆద్యంతం ఉత్కంఠభరితంగా కొనసాగగా వందలాది మంది భక్తులు పాల్గొని ఆసక్తిగా తిలకించారు. కాగా గ్రామంలో ఉట్ల పరుష సందర్భంగా ఆటబొమ్మలు, తినుబండారాల దుఖాణాలు పెద్దఎత్తున వెలియగా కొనగోళ్ళతో కిటకిటలాడాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మినరసింహస్వామిను ఊరేగిస్తున్న దృశ్యం

## అనుమతులు లేకుండా రోడ్లను తవ్వితే చర్యలు

-మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్

ఉరవకొండ, ఆగస్టు 21 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలో ఎవరైనా అనుమతులు లేకుండా రోడ్లను తవ్వితే చర్యలు తప్పవని మేజర్ గ్రామ పంచాయతీ కార్యదరి ్శ ఎ.గౌస్‌సాహెబ్ స్పష్టం చేశారు. గురువారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మేజర్ పంచాయతీ పరిధిలో లక్షలాది రూపాయలతో సిమెంటు రోడ్లు ఏర్పాటయ్యాయని అయితే కొందరు కొళాయిలు ఏర్పాటు చేసుకోవడం కోసం ఇష్టారాజ్యంగా రోడ్లను తవ్వి ధ్వంసం చేస్తున్నారన్నారు. దీంతో పాదచారులు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఎవరైనా కొత్త కుళాయిల కనెక్షన్ తీసుకోవాలన్నా, మరమ్మతులకు రోడ్లను తవ్వాల్సి వచ్చినా తప్పని సరిగా పంచాయతీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పంచాయతీ అనుమతి లేనిదే కొళాయిల కనెక్షన్లను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఇవ్వరాదని కోరారు.

## ధర్మకర్తల మండలికై రేగటి నాగరాజు దరఖాస్తు సమర్పణ

-వెంట వచ్చిన తెలుగుదేశం పార్టీ నాయకులు



ఆలయ కార్యనిర్వహణ అధికారికి దరఖాస్తును సమర్పిస్తున్న దృశ్యం

ఉరవకొండ, ఆగస్టు 21 ప్రభాతవార్త

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి ఆలయ ధర్మకర్తల మండలికై మండల పరిధిలోని రాయంపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు రేగటి నాగరాజు గురువారం దరఖాస్తు సమర్పించారు. ధర్మకర్తల మండలి ఏర్పాటుకై ఇటీవలి దేవాదాయ ధర్మాదాయశాఖ కమీషనర్ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే రేగటి నాగరాజు ఆలయంలో కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబుకు తన దరఖాస్తును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్.విజయభాస్కర్, జంగడి గోవిందు, బి.సి.మారెన్న, కె.సీతారాములు, చాబాల ఎర్రిస్వామి, పెద్దముష్టూరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఒక వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓటు ఉంటే విచారణ చేసి తొలగించండి

-ఓటరు నమోదు అధికారిని కోరిన వివిధ పార్టీల ప్రతినిధులు



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి డి.తిప్పేనాయక్

ఉరవకొండ, ఆగస్టు 21 ప్రభాతవార్త

ఒక వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓటు ఉంటే విచారణ జరిపి తొలగించాలని వైఎస్సార్‌సీపీ ప్రతినిధి ఈడిగ ప్రసాద్ కోరారు. పట్టణంలోని మండల తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఉరవకొండ-149 అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితా సవరణ, చేర్పులు, మార్పులపై నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.తిప్పేనాయక్ అధ్యక్షతన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర ్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ బీఎల్‌వోల పేర్లు, వారి మొబైల్ నంబర్ల జాబితాలు అందించాలని కోరారు. చనిపోయిన ఓటర్లను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని, విదేశాల్లో నివాసముంటున్న ఓటర్లను తొలగించడానికి చర్యలు చేపట్టాలని టీడీపీ, సీపీఎం ప్రతినిధులు పి.రాజేష్, శంకర సుదర్శన్, ఎన్.మధుసూదన్, ఎ.రంగారెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఈఆర్‌వో డి.తిప్పేనాయక్ మాట్లాడుతూ బీఎల్‌వోలందరికీ నేషనల్ ట్రైనింగ్ ప్రోగ్రాం ద్వారా దరఖాస్తుల విచారణ, విధులు, పనితీరు నైపుణ్యాలను పెంచుకోవడంపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఓటరు బదిలీ, ఇంటి నెంబరు క్షుణ ్ణంగా తెలుపుతూ ఫారమ్-8 దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఉరవకొండ, బెలుగుప్ప మహబూబ్‌బాషా, అనీల్‌కుమార్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ వరప్రసాద్, వజ్రకరూరు, విడపనకల్లు ఆర్ఐలు, బీజేపీ ప్రతినిధి హరిప్రసాద్‌చౌదరి, జనసేన ప్రతినిధి అచనాల కేశవ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు

## అక్రమ వడ్డీ వ్యాపారస్తుడు సాకే రాజశేఖర్ అరెస్ట్...!

ధర్మవరం రూరల్ ఆగస్టు21 ప్రభాతవార్త




నిందితుడిని అరెస్టు చూపుతున్న డి.ఎస్.పి, సీఐ...

ధర్మవరం పట్టణములో అధిక వడ్డీ, అక్రమ వడ్డీ వ్యాపారం కేసుల్లో ప్రధాన నిందితుడైన సాకే రాజశేఖర్ అరెస్టు చేసి కోర్టుకు తరలించడం జరిగిందని డిఎస్పి హేమంత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పీ కార్యాలయంలో గురువారం డి.ఎస్.పి హేమంత్ కుమార్ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధర్మవరము పరిసర ప్రాంతాల్లో అక్రమ వడ్డీ వ్యాపారం చేస్తూ, వడ్డీ చెల్లించని వారిని తన సహచరులతో కలిసి బెదిరించడం, దాడులు చేయించడం, బలవంతంగా డబ్బులు వసూలు చేయడం వంటి హింసాత్మక కార్యకలాపాలు రాజశేఖర్ నిర్వహిస్తుండేవాడని ఈ క్రమంలో భాగంగా సాకే రాజశేఖర్ పట్టణంలోని రైల్వే స్టేషన్ కొత్తపేట ఆర్చ్ వద్ద కనిపించడంతో నిందితుడిని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. పట్టణంలోని ఎల్ సికేపురం చెందిన రాజశేఖర్ గత నెల జూలై 23వ తేదీ పట్టణంలోని శాంతినగర్‌లోని దేవరశెట్టి భారతి ఇంటిపై నిందితుడు సాకే రాజశేఖర్ తన సహచరులతో కలిసి దాడి చేసి బాధిత కుటుంబాన్ని బెదిరించి భయభ్రాంతులకు గురిచేసి రూ.7,000 బలవంతంగా వసూలు చేయడం జరిగిందని తెలిపారు. సాకే రాజశేఖర్ అరెస్టు చేయడంతో పాటు అతని యొక్క ఆస్తుల వివరాలతో కూడిన వాటిని పూర్తిగా స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. సిల్వర్ కలర్ మొబైల్ ఫోన్ తో పాటు భూ సంబంధిత రిజిస్ట్రేషన్ పత్రాలు ప్రస్తుత మార్కెట్ విలువ సుమారు కోటి రూపాయలు, రెండు ప్రామిసరీ నోట్లు మొత్తం 10 లక్షల రూపాయలు లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అంతేకాకుండా నిందితుడు సాకే రాజశేఖర్ పై ఇప్పటికే పలు మర్డర్ కేసులతో పాటు వడ్డీ వ్యాపార దాడుల కేసులు, క్రిమినల్ 6 కేసులు (ధర్మవరం, పెనుకొండ తదితర ప్రాంతాలు) కూడా నమోదు కావడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే నిందితుడు సాకే రాజశేఖర్ పై రౌడీ షీట్ నెంబర్ 731 ఏ కేసు నమోదు కావడం జరిగిందన్నారు. ఈ కేసులో ఇదివరకే కొంతమంది ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్ కు పంపడం జరిగిందని తెలిపారు. అక్రమ వడ్డీ వ్యాపారం, దాడులు, బెదిరింపులు, హింసాత్మక ఘటనలపై పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీట్స్ ఓపెన్ చేయడం జరుగుతుందని, అంతేకాకుండా పీడీ యాక్ట్ జిల్లా బహిష్కరణ కూడా చట్టపరంగా చేయడం జరుగుతుందన్నారు. ఈ తరహాలో అక్రమ వడ్డీ వ్యాపారము, వేధింపులు, దౌర్జన్యాలు ఎదుర్కొన్న ఎవరైనా బాధితులు ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా నిర్భయంగా సంబందింత వన్ టౌన్, టూ టౌన్, రూరల్ పోలీసులకు సమాచారం తోపాటు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి పేరును గోప్యంగా ఉంచుతూ, పూర్తి రక్షణ కల్పిస్తామన్నారు. పోలీసులు ప్రజల రక్షణ కోసం ఉన్నారని భయపడకుండా సంకోచించకుండా సహాయమును కోరాలని బాధితులకు డిఎస్పి హేమంత్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ సీఐ రెడ్డప్ప సిబ్బంది పాల్గొన్నారు.

## వేతనాలు పెంచాలని అంగన్వాడిలు ధర్నా

కణేకల్ ఆగస్టు 21 ప్రభాతవార్త



వినతి పత్రం సమర్పిస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని అంగన్వాడి యూనియన్ నాయకురాలు రామాంజనమ్మ, పార్వతి అన్నారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీస్ ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్‌కు వినతిపత్రంసమర్పించారు. ఈసందర్భంగా అంగన్వాడి యూనియన్ నాయకురాలు రామాంజనమ్మ,పార్వతి మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి, ఎఫ్ ఆర్ ఎస్ రద్దుచేయాలని, మిగిలిన 1810 మినీ వర్కర్లకు క్వాలిఫికేషన్లో రిలాక్షేషన్ ఇచ్చి మెయిన్ వర్కర్లుగా మార్చాలినీ సంక్షేమ పథకాలు అమలు చెయ్యాలని, గ్రాట్యుటీ జిఓలో మార్పులు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం 2014 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెంచలేదునీ, పనిభారం పెరిగి 42 రోజులు చారిత్రాత్మక సమ్మె సందర్భంగా జూలైలో వేతనాలు పెంచుతామని చెప్పడం జరిగిందినీ అయినా ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం దాని గురించి పట్టించుకోవడం లేదునీ అంగన్వాడీ సెంటరు నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు పనిచెయ్యడం లేదునీ . పోషణ డాక్టర్ , బాలసంజీవిని యాప్స్ అమలుకు ఫోన్లు సపోర్ట్ చేయడం లేదునీ, కానీ అధికారులు లబ్దిదారులకు ఫోటోక్యాప్చర్, ఓటిపి, ఎఫ్ ఆర్ ఎస్ ద్వారానే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధన అమలు చేయడానికి అంగన్వాడీలు అనేక ఇబ్బందులు పడుతున్నారునీ అన్నారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి. మిగిలిన 1810 మినీ వర్కర్లను క్వాలిఫికేషన్లో రిలాక్షేషన్ ఇచ్చి మెయిన్ వర్కర్లుగా మార్చాలి, అన్ని యాప్లు కలిపి ఒక యాప్ మార్పుచేయాలి, సెంటర్ నిర్వహణకు ట్యాబ్లు ఇవ్వాలి, 5జి నెట్ ఇవ్వాలని, ప్రధానమంత్రి మాతృవందన పథకాన్ని కొత్తగా అంగన్వాడీలకు అప్పగించరాదునీ . గ్రాట్యుటీ జి.ఓలో మార్పు చేయాలి, పై సమస్యలునీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు రామాంజినమ్మ, కార్యదర్శి పార్వతి, సెక్టర్ లీడర్స్ యశోద నాగరత్న అంగన్వాడిలు , నాయకులు తదితరులు పాల్గొన్నారు

## పాత ఫోన్లతో కొత్త యాప్ కష్టాలు

-సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడి కార్యకర్తల నిరసన



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడి కార్యకర్తలు

చిలమత్తూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త

పాత మొబైల్ ఫోన్లలో కొత్త యాప్‌లు ఇన్‌స్టాల్ కాకపోవడం, తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల పనులు నిర్వహించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అంగన్‌వాడి కార్యకర్తలు వాపోయారు. ఈ మేరకు గురువారం చిలమత్తూరు మండల కేంద్రంలోని బిఆర్‌అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడి కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు యాప్‌లతో పనిలేకుండా చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మాట తప్పిందని ఆరోపించారు. ఇప్పటికే వున్న యాప్‌లకు తోడు ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బాలసంజీవని 2.0 వర్షన్ కారణంగా పనిభారం మరింత పెరిగిందన్నారు. గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ కోసం ఫోటో క్యాప్చర్ తప్పనిసరి చేయడం, ఒక్కో పనిని మూడు వేర్వేరు యాప్‌లలో అప్‌లోడ్ చేయాల్సి రావడం తమకు భారమైందని పేర్కొన్నారు. పైగా ఫేస్‌యాప్‌లో హాజరు నమోదు చేసిన రోజులకు మాత్రమే వేతనం ఇవ్వడం మరింత అన్యాయమని కార్యకర్తలు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరంగి ప్రవీణ్‌కుమార్, అంగన్‌వాడి ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి శోభారాణి, మండల నాయకులు పద్మావతి, రామతులసి, సునీత, ఉషారాణి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

